ఆ స్పీకర్‌కి ఏమీ తట్టకపోవచ్చు గాని; కొంతసేపు గడిచేక ఒకసారి వాచీ వేపు చూస్తే అతని స్పీచి అపమనే రిక్వెస్టుగా అది పని చేయవచ్చు.

ఒకానొక రాజకీయోపన్యాసకుడు తన సుదీర్ఘ ప్రసంగం ముగిస్తూ : "శ్రోతలు క్షమించాలి. అనుకోకుండా కొంచెం ఎక్కువసేపు మాట్లాడినట్టున్నాను. నా గడియారం ఆగిపోయింది. చూసుకోలేదు." అన్నాడట. ప్రేక్షకుల్లోంచి ఒకరు, "గడియారం సంగతి సరే! వెనకాల అంత పెద్ద కేలండరుంది. అదీ కనబల్లేదా?" అన్నారట. ★

# 82. బతక నేర్చిన బాబు

**నే**ను పనిచేసిన ఆఫీసులో బాబూరావు అని ఒకతను ఏడేళ్ల కిందట సీనియర్ గుమస్తాగా ఉండేవాడు. "ఆఫీసు పని అంటే పరమపదసోపానపటం లాంటిది. పని అనేది పాముల్లాంటిది. కెరియర్ అనేది నిచ్చెనలాంటిది.అంచేత పని అనే పాములు మనల్ని మింగకుండా కెరీరు అనే నిచ్చెనలు ఎక్కిపోవడమే ఆఫీసుల్లో ఉద్యోగాలు చేసేవాళ్ల ధ్యేయంగా పెట్టుకోవాలి" అని అతని సిద్ధాంతం. ఉదయం అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకం పెట్టాక కొన్ని నిముషాలు శ్రద్ధగా తన సీట్లో కూర్చున్నాకనే అసిస్టెంటు మేనేజర్ దగ్గరి కెళ్తాడు. "సార్, మీకు యూనివర్శిటీ ఏరియాలో ఏదైనా పనుంటే చెప్పండి సార్" అని జేబులోంచి ఒక కాగితం తీస్తాడు. ఎ.ఎమ్ (అసిస్టెంటు మేనేజర్) యూనివర్శిటీ ఏరియా ఏమిటి, తనకి ఏదైనా పనుండడమేమిటి? ఉంటే మాత్రం ఆ వివరాలు బాబూరావుకి చెప్పడమెందుకు - అని ఆలోచించే లోపల :

"ఏంలేదు సార్. లోగడ మీకు చెప్పాను కదా. మా మేనకోడలు ఏలూర్నించి వచ్చి ఇక్కడ బీకామ్ పరీక్ష రాయడం, అదంతాను. ఆ అమ్మాయి ఫస్టుక్లాసులో పాసైందని పేపర్లో వేసిన రిజల్టు చూస్తే తెలిసిందిట. కాని, నెలరోజులు దాటిపోయినా మార్కుల షీటు చేరలేదుట. ఓసారి వెళ్లి కనుక్కొని రావాలి సార్."

ఎ.ఎం. గారు మళ్లీ ఆలోచనలో పడతారు. ఆ అమ్మాయి (అదే, బాబూరావు మేనకోడలు) ఏలూరు నుండి రావడం; బి.కాం. పరీక్ష ఇక్కడ రాయడం ఇతను తనకి చెప్పాడా. చెప్తే తనకెందుకు గుర్తు రావడం లేదు - అలా అలా.

బాబూరావు తన జేబులోంచి తీసి పట్టుకున్న కాగితం ఎ.ఎం.గారి ముందు రెపరెపలాడిస్తూ "అదే సార్. ఆ మధ్య మీ అమ్మాయికి చినవాల్తేరులో ఏదో సంబంధం వచ్చిందనీ, ఆ అబ్బాయి రాయపూర్‌లో పనిచేస్తున్నాడనీ, దసరాకి వస్తాడనీ అన్నారు కదా. అట్నుంచి అటు వెళ్లి ఆ అబ్బాయి ఊళ్లోకి వచ్చాడో లేదో కనుక్కొని వచ్చేస్తాను సార్!"

"నాకు ఒక గంటసేపు బైట పన్లున్నాయి గనుక, దయచేసి పర్మిషన్ ఇవ్వమని ప్రార్థిస్తున్నాను" అని కాగితం మీద పెట్టకుండా, కనీసం నోటితోనయినా అడక్కుండా అలా ఆయమాయ గారడీలు చేసి వెళ్లిపోవడం బాబూరావు ప్రత్యేకత. అతను వెళ్లిన పావుగంటకో అరగంటకో ఎ.ఎం. గారికి బాబూరావు పెట్టిన ఫైల్లో ఏదో సందేహం వచ్చి అతన్ని పిలవమంటారు; ఎవరో ఒకరు ఆయన కేబిన్‌లోకి వెళ్లి మీరే కదండి సార్, అతనికి గంట పర్మిషనిచ్చి పంపేరు?

అదేదో చిన వాల్తేరు, మీ అమ్మాయి పెళ్లి సంబంధం - అంటూ వెళ్లాడండీ..." అని చెప్తారు.

బాబూరావు ఒక్కొక్కప్పుడు పర్మిషన్ కోసం ఎ.ఎమ్ గారి వరకూ కూడా వెళ్లడు. గవర్నమెంట్‌కి రిప్లయి వెళ్లవలసిన కాగితం ఒకటి పట్టుకొచ్చి నాతోగాని ఈశ్వర్రావుతోగాని అంటాడు. "గురూ, గురూ, ఈ కాగితానికి డ్రాఫ్ట్ రిప్లయి, దీని మీద ఒక 'నోటు' ఇవాళ పెట్టి తీరాలంటున్నాడు సీనియర్ మేనేజరు. నాకేమో బయట ఒక అర్జంటు పనుంది. అది సరే అనుకో. కాని ఈ సబ్జక్టు మీద నీకున్నంత కమాండు నాకు లేదు కదా. నువ్వయితే చిటికెలో రాసి అవతల పారేస్తావు" అంటాడు.

వెనకటికి ఒక ఆఫీసర్ దగ్గరికి అతని మిత్రుడెవరో వచ్చి కాసేపు కులాసా కబుర్లు చెప్పుకున్నాక "మీ ఆఫీసులో ఎంతమంది పని చేస్తారు?" అని అడిగితే ఆ ఆఫీసరు "సగం మంది" అని సమాధానం చెప్పేడని ఒక కథ ఉంది. అలాగే, ఒక చిరుద్యోగి తన పై అధికారితో "అయ్యా, కష్టం ఆలోచించాలి. నేను ముగ్గురి పని చేస్తున్నాను. నా జీతం పెంచండి సార్!" అని మొరపెట్టుకుంటే "అలాగే పెంచుతాను గానీ; మిగతా ఇద్దరూ ఎవరో వాళ్ల పేర్లు చెప్పు; వాళ్లని డిస్మిస్ చేస్తాను!" అని ఆ పై అధికారి అన్నాడట- అని ఇంకో కథ వుంది. ఇలాటి జోకులన్నీ సరదాకి చెప్పుకొనేవే గానీ సరదాగా పుట్టించినవి మాత్రం కాదు. బాబూరావు లాంటి వాళ్లతోబాటు నాలాంటి వాళ్లూ, ఈశ్వర్రావు లాంటి వాళ్లూ ఉన్నారు గనకనే అవి పుట్టేయి.

పార్కిన్‌సన్ అనే పాశ్చాత్య మహాశయుడు ఆఫీసు, ఆఫీసేతర పనులకి వర్తిస్తుందన్నట్టుగా ఒక సూత్రం రూపొందించేడు. "ఏ పని అయినా సరే, దానికోసం నియమించిన పనివాళ్ల సంఖ్యను బట్టి, దానికోసం కేటాయించిన సమయాన్ని బట్టి...... పెరుగుటా తరుగుటా అగును" అని ఆ సూత్రం సారాంశం. "మిష్టర్ సుబ్బారావు! ఈ కాగితం మీద గవర్నమెంటుకి రిప్లయి వెళ్ళాలి. నువ్వు మిగతా పన్లన్నీ ఆపేసి అరగంటలో తయారుచేసి పట్రా", అంటే అరగంటలో కాకపోయినా గంటలోనో, లంచిటైమ్‌కో పూర్తవుతుంది. అలా చెప్పకుండా; "ఇదుగో, సుబ్బారావూ; ఈ కాయితం చూడు. దీనిమీద మనం గవర్నమెంటుకి ఒక రిప్లయి పంపాలి. కనక నువ్వు దీన్ని జాగర్తగా స్టడీ చేసి; అవసరమైతే బాబూరావునీ, ఈశ్వర్రావునీ సాయం అడిగి; రిప్లయి పకడ్బందీగా తయారు చెయ్యాలి. సాయంకాలానికల్లా మీరు ఒక రఫ్ రాసి పుటప్ చేస్తే రాత్రి నేను ఫైలు ఇంటికి తీసికెళ్లి దిద్దేస్తాను. రేపు ఉదయం ఫేర్ కాపీ రాసి ఎప్రూవల్ తీసుకుంటే టైపు చేయించి రేపు సాయంకాలం డిశ్పాచ్ చెయ్యొచ్చు" అని మేనేజరు అన్నాడంటే; సుబ్బారావూ, బాబూరావూ, ఈశ్వర్రావూ ముగ్గురూ కూడా మిగతా పనంతా ఎగ్గొట్టడమే కాకుండా ఆ కాగితానికి రిప్లయి (పకడ్బందీగా) తయారు చేయడానికి రెండు రోజులు పట్టడం ఖాయం - అని పార్కిన్‌సన్‌గారి సూత్రానికి భాష్యం. ఇది కూడా సరదాకి చెప్పింది కాదు

రెండేళ్ల కిందట రిటైరయ్యాను గానీ నాకు మా పాత ఆఫీసుతో పనులింకా వుండి పోయాయి. ఈ మధ్యకాలంలో బాబూరావే ఆ ఆఫీసుకి మేనేజరు అవడం విశేషం. మొన్న ఒకనాడు కొంచెం టైపింగు రెండు జిరాక్సులూ చేయించి ఒక ధరఖాస్తు పెట్టవలసొస్తే వెళ్లాను. బాబూరావు నన్ను సాదరంగా తన కేబిన్‌లోకి తీసికెళ్లేడు. తనే స్వయంగా కప్పులు కడిగి ఫ్లాస్కులోంచి టీ వొంచి ఇచ్చేడు. కులాసాగా ఉన్నావా - అన్నాడు. "బొజ్జ తగ్గి ఆరోగ్యంగా

కనిపిస్తున్నా" వన్నాడు.

"సరేగానీ, ఓసారి మీ ప్యూన్ని పిలు..." అన్నాను.

"ఎందుకు?"

"ఇదుగో, ఈ రెండు కాగితాలూ జిరాక్సులు తీయించాలి."

"ఈ మాత్రం దానికి ప్యూనెందుకు?" అని లేచి వెళ్లి ఓ నిమిషంలోగా వచ్చేడు. "సారీ బ్రదర్. జిరాక్సు మిషన్ చెడిపోయిందిట." అన్నాడు.

"అందుకే ప్యూన్ని పిలిస్తే బైట ఎక్కడైనా చేయించుకొస్తాడని..."

బాబూరావు వాచీ చూసుకున్నాడు. "ప్యూను ఒక గంట వరకూ రాడు. మా ఇంటికి వెళ్లి కేరియర్‌తో భోజనం తెమ్మని పంపేను!" అన్నాడు.

"పోన్లే. మీ టైపిస్టుని పిలిపించు. ఈ లెటర్ రెండు కాపీలు టైప్ చెయ్యమందాం."

అదికూడా హుళక్కే అయింది.

యూనివర్శిటీలోనూ, ఆర్.టి.ఓ. ఆఫీసులోనూ, "కరెంటాఫీసు" లోనూ ఇతని పనులు చేసుకు రావడానికి వెళ్లిపోయాడు టైపిస్టు. అలా అతను తన ఇంటికి వెళ్లి భోంచేసి మధ్యాహ్నం రెండు గంటలకల్లా వస్తాడట.

"బాబూరావులు" చాలా ఆఫీసుల్లో ఉంటారు. వారందరూ జిందాబాద్!

★

# 83. మార్క్సి-ఇదమ్

ప్రహ్లాదుడికి పాఠాలు చెప్పడానికి హిరణ్యకశ్యపుడు నియమించిన చండామార్కులు ప్రహ్లాదుడికి మార్కులు వెయ్యలేకపోగా హిరణ్యకశ్యపుడి చేత మార్కులు వేయించుకోలేక పోయారుట. అదుగో అప్పట్నుంచీ ఉన్నట్టుంది ; మార్కులు సంపాదించుకోవాలనే కోరికా, దానికోసం ప్రయత్నాలూ, ఉద్యమాలూ.

నేను విశాఖపట్నంలో పామ్‌గ్రోవ్ అనే పదివాటాల సౌధంలో ఉంటున్నప్పుడు ఎమ్వీయల్ మా ఇంటికి తరుచూ వస్తూండేవాడు. ఓసారి మేం ఇద్దరం మా వాటాకున్న డాబా మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటే కింది నుంచి ఓ గొంతు వినబడినప్పుడు ఎమ్వీయల్ అటువేపు వంగి "హలో, శేషగిర్రావు గారూ; నమస్తే!" అన్నాడు. అట్నుంచి "నమస్తే" వినబడ్డాక ఇటు తిరిగాడు. "శేషగిర్రావు మీ పొరుగునే ఉన్నారని మీరెప్పుడూ నాకు చెప్పనేలేదు!" అని నిష్ఠూరం ఆడేడు. "ఆయన మీకు తెలుసని నాకు తెలీదు కదా..." అని సంజాయిషీ ఇచ్చుకున్నాను. "ఆయన్ని నాకు తెలీకపోవడమేమిటి? పైగా ఈ మధ్యనే మార్క్సిస్టు అయ్యాడు కదా..." అన్నాడు ఎమ్వీయల్. నేను నిర్ఘాంతపోయాను. "ఛా ఛా, ఆయన అలాటి వాడు కాదండీ... పైగా ఈ మధ్య ఆయన లెక్చర్ టూర్‌మీద వెళ్లింది వెస్టు జర్మనీకే గాని ఈస్టు జర్మనీకి కాదు." అన్నాను.